క్లుప్తంగా

ఘనంగా జెండా పండగ

నందిగామ: నూతన సంవత్సరం ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కార్మికులు జెండా పండగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో రిక్షా యూనియన్, చర్మకారులు, రామన్నపేట, చందర్లపాడు, రైతుపేట, పాత, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని పలు ముఠాల కార్మికులు జెండా పండగను ఘనంగా జరుపుకున్నారు. ఏటా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, తమ బతుకులు బాగుండాలని కోరుకుంటూ జెండా పండుగ నిర్వహించడం ఆనవాయితీ. పట్టణంలో వేర్వేరుగా జెండా ర్యాలీలు జరిగాయి.

హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

కంచికచర్ల : కంచికచర్లలో హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో భైరి నరేష్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహారం పంపిణీ

ఇబ్రహీంపట్నం: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా పోషకాహారం కిట్లు ఆదివారం దాతలు అందించారు. ఎన్టీటీపీఎస్ రిటైర్డ్ డిప్యూటీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, మూలపాడు, కొండపల్లి ఏపీహెచ్ ఎంఈఎల్ ప్రాంతానికి చెందిన 35 మంది బాధితులకు వీటిని అదజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ గత ఏడాది కాలంగా ప్రతినెలా హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహారం అందించేందుకు సహాయ పడుతున్న ఏపీ జెన్‌కో ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ రిటైర్డ్ సీఈ శ్రీరాములు, ఎస్ఈ సురేష్‌బాబు, ఈఈలు అరుణ్ కుమార్, నారాయణ, రామలక్ష్మి, విద్యుత్ సౌధ సహాయ ఎకౌంట్స్ అధికారి లక్ష్మీ నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై పఠనం

గంపలగూడెం: ధనుర్మాసం సందర్భంగా గంపలగూడెం రామాలయం, భజన మందిరం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో తిరుప్పావై పఠనం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భజన మందిరంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి మూలవిరాట్ విగ్రహాలకు వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు విశేషంగా పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్‌కు సత్కారం



తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన స్థానిక నాగార్జున స్కూలుకు చెందిన విద్యార్థి వీ సువర్ణను నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరి బాయి ఆదివారం అభినందించారు. నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు సువర్ణను శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. నాగార్జున స్కూలులో కూడా సువర్ణను ఉపాధ్యాయులు అభినందించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



మైలవరం: పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆదివారం ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి ఆదివారం ఆవిష్కరించారు. మైలవరం పీఆర్‌టీయూ కార్యాలయంలో ఎంపీడీఓ పీ.రత్నశ్యామ్‌బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్నరాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు కష్టపడి విద్యను బోధిస్తున్నారని, అందుకే సమాజంలో వారికి ప్రత్యేక గుర్తింపు ఉందని, డాక్టర్లు, ఇంజినీర్ల కొరత లేకుండా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఆధ్యక్షులు పీ.గోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శోభనాచలునికి పూజలు

ఆగిరిపల్లి: జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఆగిరిపల్లిలో వేంచేసియున్న శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారిని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలైన నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ వీరబాబు, గోళ్ల ఇసాక్, నాయకులు అత్తి మురళీ, రానిమేకల సత్యానారాయణ, శీలం రామయ్యారావు, పల్లె రవీంద్ర రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ఆగిరిపల్లి: మండలంలోని మామిడి తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందేలపై ఆదివారం ఎస్ఐ ఎస్.చంటిబాబు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో 5 మందిని అదుపులోకి తీసుకుని, 4 కోడి పుంజులు, రూ.2,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామన్నారు.

అంబరాన్నంటిన న్యూ ఇయర్ వేడుకలు

- ఆనందోత్సాహాలతో నూతన సంవత్సరానికి స్వాగతం
- గ్రామాల్లో ఇంటింటా సందడి



ప్రభుత్వ విప్ ఉదయభాను, విమలాభాను, వెంకటకృష్ణ ప్రసాద్‌ను సత్కరిస్తున్న అభిమానులు



నందిగామలో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల వ్యాప్తంగా నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. శనివారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే పట్టణంలో కొత్త సంవత్సర వేడుకల కోలాహలం మొదలైంది. పలు కూడళ్లలో యువకులు ఉత్సాహంగా టపాసులు కాలుస్తూ హంగామా చేశారు. అనేక మంది బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ తమ ఉత్సాహాన్ని కనపరిచారు. మహిళలు తమ గృహాల ముందు వివిధ రకాల రంగులతో అందంగా 2023కు స్వాగతం అనే అక్షరాలను చిత్రీకరించగా పలు చర్చిల వద్ద కేక్‌లు కట్ చేసి ప్రార్థనలు నిర్వహిస్తూ నూతన సంవత్సరాన్ని స్వాగతించారు. అలాగే పలు రాజకీయ శిబిరాల వద్ద తమ నేతలకు శుభాకాంక్షలు చెప్పేందుకు అభిమానులు, ఆయా పార్టీల కార్యకర్తలు బారులు తీరారు.

జీవితాల్లో వెలుగులు నింపాలి
ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో..

ఈ నూతన సంవత్సరం నియోజకవర్గ ప్రజలకు మేలు చేస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. తనను కలిసేందుకు నియోజకర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలకు ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఉదయభాను నివాస ప్రాంతం ఆదివారం జనసమూహంతో అత్యంత రద్దీగా మారింది. పట్టణ, నియోజకవర్గ ప్రజలతో అద్దాలబజారులో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. తమ అభిమాన నాయకుడు ఉదయభానుకు శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రజలు పోటెత్తారు.

గజమాలతో సత్కారం..

ఈ సందర్భంగా మొక్కలు, నోట్ పుస్తకాలు, పుష్పగుచ్ఛాలతో వేలాదిమంది తరలివచ్చి ఉదయభాను, విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, వైఎస్సార్ సీపీ నియోజవకర్గ యువనేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నేతలు గజమాలలు వేసి కేక్‌లు కట్ చేశారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్‌లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, చిలుకూరి శ్రీనివాస్, డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ నాగమురళి, పోలీసులు, మెప్మా సభ్యులు, కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, పలు సొసైటీల అధ్యక్షులు, గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిల్లకల్లు పీఎస్‌లో..

జగ్గయ్యపేట: మండలంలో న్యూ ఇయర్ వేడుకలను వేడుకలు ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచే 2022కు వీడ్కోలు పలుకుతూ 2023కు స్వాగతం పలుకుతూ కేక్ కటింగ్ చేశారు. చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది ఏ ర్పాటు చేసిన కేక్‌ను ఎస్ఐ చిన్నబాబు కట్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జయచంద్ర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

వత్సవాయిలో సంబరాలు

వత్సవాయి: గ్రామాల్లో యువకులు శనివారం రాత్రి పన్నెండు గంటలు దాటగానే నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. బాణాసంచా కాల్చి, తీన్‌మార్ వాయిద్యాలతో సందడి చేశారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం నూతన సంవత్సరం సందర్భంగా గ్రామాల్లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తహసీల్దార్ వైకుంఠ రావు, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, ఎస్ఐ అభిమన్యు, ఎంఈఓ ఎల్.నాగరాజులను ఆయాశాఖలకు చెందిన సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భవిష్యత్తుపై భరోసాతో 'నూతన' అడుగులు

నందిగామ టౌన్: గతం తడిమిన అనుభవ పాఠాలతో జాగ్రత్త పడితే భవిష్యత్తులోకి పూర్తి భరోసాతో అడుగేయవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కట్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీ నాగేశ్వరరెడ్డి, నాలుగు మండలాల తహసీల్దార్‌లు, సీఐలు, ఎస్ఐలు, ఎంపీడీవోలు తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చల్లా బ్రహ్మేశ్వరరావు, మహ్మద్ మస్తాన్, ఆవుల రమేష్‌బాబు, దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కోటేరు ముత్తారెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, అమర్లపూడి కీర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని పాస్టర్ జాన్‌కోటేశ్వరరావు అన్నారు. కంచికచర్ల, మండలంలో పలు గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. యువత సందడి చేశారు.

నందిగామ: నూతన సంవత్సరం సందర్భంగా నందిగామ పట్టణంతోపాటు మండల పరిధిలోని అన్ని చర్చిలు కొత్త శోభను సంతరించుకున్నాయి. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పలువురు గురువులు దివ్యబలి పూజ సమర్పించారు. సీఎస్ఐ, బేతేలు, బేతెస్థ, పరిశుద్ధ యోహాను ప్రార్థన మందిరాల్లో తెల్లవారుజాము వరకు ఆరాధన కార్యక్రమాలు జరిగాయి.డీవీఆర్ కాలనీలోని సీయోను ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. జీడీఎంఎం విద్యా సంస్థల అధినేత డాక్టర్ గురువిందపల్లి వరప్రసాదరావు క్రీస్తు సందేశాన్ని అందించారు.

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. పల్లగిరి గుట్టపై ఉన్న స్వయంభు శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. అంబారుపేటలోని శ్రీ సత్యమ్మ ఆలయంలో పలువురు వాహనాలకు పూజలు చేయించారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: నూతన సంవత్సర వేడుకలను గ్రామాల్లో, వాడవాడలా శనివారం రాత్రి నుంచే ఘనంగా నిర్వహించారు. ఆదివారం మహిళలు తమ లోగిళ్లలో ముగ్గులు వేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్నారులు కేక్‌లు కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. యువత బైక్‌లపై సందడి చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎస్ హరిప్రసాద్ కేక్ కట్ చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పలు సెంటర్లలో ప్రజాప్రతినిధులు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు.

అందరికీ శుభాలు కలగాలి

కంచికచర్ల: కొత్త సంవత్సరం ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎంపీపీ షేక్‌మలక్‌బషీర్ అన్నారు. మండలంలోని పెండ్యాలలో ఎంపీపీని ఆదివారం మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు. ముందుగా ఎంపీపీ కేక్ కోశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ బడేహజరత్, ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలశంకరరావు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో ఓ ఇంటి ముంగిట రంగవల్లి



సుగాలీలతో నృత్యం చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



ఆకట్టుకున్న రంగవల్లులు



పెండ్యాలలో ఎంపీపీ మలక్‌బషీర్‌కు శుభాకాంక్షలు



చిల్లకల్లులో కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ చిన్నబాబు

పెంచిన నగదుతో పింఛన్ల అందజేత



అనిగండ్లపాడులో నూతన పింఛన్‌దారులతో సర్పంచ్ జ్యోతిబ్రహ్మం



పెన్షన్‌దారులతో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు

జగ్గయ్యపేటఅర్బన్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితరులకు రూ.2 వేల నుంచి రూ.2,750 వరకు పెన్షన్లను రాష్ట్రప్రభుత్వం పెంచిన సందర్భంగా జరుగుతున్న పెన్షన్ వారోత్సవాలు పట్టణంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక 11వ నెంబర్ సచివాలయం(23, 24వా ర్డులు)లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ముఖ్య అతిధిగా పాల్గొని లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్‌ను అందజేశారు. నాడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా పెన్షన్ పెంచుకుంటూ పోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం సందర్బంగా లబ్ధిదారులతో కేక్ కట్ చేయించి పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్ సాధుపాటి రాజు, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, నాయకులు దువ్వల రామకృష్ణ, కాశి కిషోర్, చిరంజీవి పాల్గొన్నారు.

98 శాతం పంపిణీ..

కంచికచర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నెరవేర్చే ఏకైక సీఎం అని పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పింఛన్లను అందజేశారు. ఈ మేరకు రత్నాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చుతున్నారని ఈ ఏడాది పెన్షనర్లకు రూ. 250లతో కలిపి మొత్తం రూ.2,750 నగదు ఉదయమే లబ్దిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. మండలంలో ఒక్కరోజే 98శాతం పింఛన్‌లు అందజేశామని రత్నాకర్ అన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

అవ్వ, తాతల ముఖాల్లో ఆనందం

వత్సవాయి: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఆదివారం లబ్ధిదారులకు వలంటీర్లు అందజేశారు. పింఛన్‌ను ప్రభుత్వం రూ.2,500 నుంచి రూ.2750కి పెంచారు. ఈ మేరకు పెంచిన మొత్తంతో కలిపి లబ్ధిదారులకు అందించారు. దీంతో అవ్వ, తాతల ముఖాల్లో ఆనందం వెల్లివెరిసింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలో భాగంగా పింఛన్ పెంచారన్నారు. ఇచ్చినమాటకు కట్టుబడిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సర్పంచులు భూక్యా సీతమ్మ, గుడేటి శారమ్మ, కొట్టె నగేష్, భీమాల సుజాత, చావా దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ చారిత్రాత్మకం

పెనుగంచిప్రోలు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు పెంచుకుంటూ పోవటం చారిత్రాత్మకమని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయంలో జరిగిన నూతన పింఛన్ల పంపిణీలో సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కరోనా కష్టకాలంతో కూడా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోందన్నారు. నిత్యం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే అనిగండ్లపాడులో సర్పంచ్ జ్యోతి బ్రహ్మం నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గంగూరి ప్రసాద్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, ఎస్సీ నాయకులు దోసపాటి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

పెద్దాపురం(వీరులపాడు): అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి చెప్పారు. మండలంలోని పెద్దాపురంలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో వెయ్యి ఉన్న పింఛన్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 2750 చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ..

జగ్గయ్యపేట: మండలంలో ఆదివారం పింఛన్ల పంపిణీని ఆదివారం వలంటీర్లు ఉత్సాహంగా నిర్వహించారు. పెరిగిన పింఛన్‌ను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 50 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ జయచంద్ర తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది నుంచి పెంచిన పింఛన్‌తో కలిసి పంపిణీ చేయటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గౌరవరం, బూదవాడ, అనుమంచిపల్లి, చిల్లకల్లు గ్రామాలలో నాయకులు పెరిగిన పింఛన్లను అందజేశారు. ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్, నాయకులు సయ్యద్ బాలసైదా, పానుగంటి త్రివేణి, బూతుకూరి నాగిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.



పెద్దాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మి తదితరులు



పెనుగంచిప్రోలులో నూతన పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ పద్మకుమారి



గండేపల్లిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్



పింఛన్ అందిస్తున్న సర్పంచ్ శారమ్మ తదితరులు

ప్రగతిపథంలో దూసుకెళ్తున్న పల్లెలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెలు ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని కేతవీరునిపాడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో గ్రామ పంచాయతీ కార్యాలయాలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులతో పాటు రైతులు వ్యవసాయ పనులకు వినియోగించే యాంత్రీకరణ పరికరాలను సైతం రాయితీపై అందిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి పల్లె ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామాభివృద్ధికి అనితర కృషి చేస్తున్న సర్పంచ్ నెలకుదిటి శిరీష, శివనాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మహ్మద్ మస్తాన్, గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, కీర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



డీపీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉదయభాను, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఆదివారం ఎస్టీయూ జగ్గయ్యపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీవీఎల్ నరసింహారావు, కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎస్టీయూ బృందం ఉదయభానును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు బియ్యాల రామారావు, ఎం.శ్రీహరి, సీహెచ్.శ్రీనివాసరావు, పీవీ.నరసింహారావు, మండల నాయకులు కె.రాజేంద్ర, ఎల్.బుజ్జిబాబు, ఎల్ఎండీ.నాయక్, పి.సర్జనరావు పాల్గొన్నారు.

డీపీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ..

డీపీఆర్టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆయన నివాసంలో ఆవిష్కరించారు. డీపీఆర్టీయూ సంఘ నాయకులు శెట్టి దుర్గాప్రసాద్, బి.శ్రీనివాస్, నేలవెల్లి రమేష్, కరుణాకర్‌రెడ్డి, రాంబాబు, మల్లెల నాగేశ్వరరావు, కొండయ్యాచారి, రాఘవాచారి పాల్గొన్నారు.